కథ

# తెల్లకాకి

-నందివాడ నిర్మల శాంత కుమారి



'ఊరుకో రంగన్నా, లే! నువ్వే ఇంత బెంబేలు పడిపోతే మీ ఆవిడకెవరు ధైర్యం చెపుతారు చెప్పు. పోయిన వాళ్ళతో మనమూ పోలేముగా ఇటువంటప్పుడే గుండె దిటవు చేసుకోవాలి' ఓదార్పుగా అన్నాడు శేఖర్.

'ఎలా ఊరుకోమంటారు శేఖర్ బాబూ. చేతికందివచ్చిన చెట్టంత కొడుకు ఒక్కసారిగా మమ్మల్ని నడి సముద్రంలో ముంచిపోతే ఇక మాకు దిక్కెవరు బాబూ' భోరున విలపిస్తూ చెప్పాడు రంగన్న.

'మన ప్రయత్నం మనం చేశాం. కాని ఫలితం లేకపోయింది. ఏం చేస్తాం? లే, రెండురోజులుగా నువ్వుగానీ, సత్తెమ్మకానీ ఎంగిలి పడలేదు. ఇడ్లీ తెచ్చాను. ఇద్దరూ తినండి' పొట్లాం చేతికిస్తూ చెప్పాడు.

'శేఖర్ బాబూ మాకు లేక లేక పుట్టాడు ఒక్కగానొక్క కొడుకు వాడినెంత ముద్దుగా పెంచుకున్నాం. అడికి ఏ కట్టం తెలియకుండా కోరిందల్లా ఇచ్చాం' సత్తెమ్మ లోపల్నుంచి ఏడుస్తూ బయటకు వచ్చింది.

'చూడు సత్తెమ్మా. మన బతుకుల్తో ఆ దేవుడు ఆటలాడుకుంటున్నాడు. వాడు ఆడినట్లల్లా ఆడటం మనిషిపని. ఎవరినైనా ఎప్పుడు తీసుకువెళతాడో ఎవరూ చెప్పలేం' అనునయంగా అన్నాడు శేఖర్.

'అవును బాబూ, మా పేదోళ్ళ బతుకులంటే ఆ దేవుడికి కూడా అలుసే, అందుకే మాకీ కడుపుకోత పెట్టి, ఆయన పూజలందుకుంటున్నాడు.'

'ఒసే, ఊరుకోయే దేవుడు లేకపోతే ఏమే,దేవుడు లాంటి మన శేఖర్‌బాబూ, ఆయన చల్లని దయ మనకుంటే చాలే. మన కుర్రోణ్ణి ఆయనలో చూసుకుందామే' భార్యని ఓదార్చాడు రంగన్న జీరబోయిన గొంతుతో.

'వెళ్తా రంగన్నా, మళ్ళీ రేపు కలుస్తాను. సత్తెమ్మ జాగ్రత్త ఇద్దరూ మనస్సు కుదుట పరచుకోవాలి మరి' బయటకు కదిలాడు శేఖర్.

బయటకు వచ్చిన శేఖర్ మనస్సునిండా అనేక ఆలోచన్లు అలముకున్నాయి: రంగన్న కొడుకు సుబ్బారావే కళ్ళ ముందు మెదులుతున్నాడు.

సుబ్బారావు ఇంకా చాలాకాలం బతికేవాడు కానీ ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణం తీసింది. కారణం ఎవరు? తనకు తెలును అందుకే అటువైపు నడుస్తున్నాడు.

★ ★ ★

'మనీ క్లినిక్. డాక్టర్ ధనదాహాలరావు' నల్లటి బోర్డు మీద తెల్లటి అక్షరాలు చెక్కబడి ఆ బోర్డు గోడకు వ్రేలాడుతోంది. శేఖర్ సైకిల్‌కి స్టాండువేస్తూ ఆ నేమ్ ప్లేట్ వంకచూస్తూ మనిషికి తగ్గపేరే పెట్టారని నవ్వుకున్నాడు.

లోపల ఇద్దరు, ముగ్గురు పేషెంట్లు ఉన్నారు. డాక్టర్ తన సీటులో కూర్చుని పేషెంటుని పరీక్షిస్తూ బయటకు చూస్తున్నాడు ఇంకెవరైనా వస్తున్నారా?- లేదా? అని.

శేఖర్‌ని చూసి ఓ విషపునవ్వు విసిరాడు. ఆ నవ్వులో కూడా శేఖర్‌కి డాక్టర్ నోట్లో పలువరుస బదులు పైసల వరుస కనబడింది.

అందరూ అయిపోయాక 'రండి కూర్చోండి' అన్నాడు. డాక్టర్ స్టెతస్కోపు చెవులకు తగిలించుకుంటూ...

'ఏం లేదు డాక్టర్. మీతో పదినిమిషాలు పర్సనల్‌గా మాట్లాడాలి' అంటూ కాంపౌండర్ వంక ఇబ్బందిగా చూశాడు.

అర్థం చేసుకున్న కాంపౌండర్ బయటకు నడిచి తలుపులు దగ్గరగా వేశాడు.

చెప్పమన్నట్లుగా శేఖర్‌వంక చూశాడు డాక్టర్.

'డాక్టర్ గారూ, సుబ్బారావు దేనివల్ల చనిపోయాడు. అతనికి వచ్చిన జబ్బేమిటి?' సౌమ్యంగా అడిగాడు.

'అతనికి వచ్చింది విషజ్వరం. బాగా ముదిరిపోయింది. అంతే కాదు పత్యం కూడా చేయలేదు' కొద్దిగా తటపటాయించాడు డాక్టర్.

'నో, డాక్టర్ మీ వద్దకు వచ్చే ముందు రోజే మేమిద్దరం కలిసి సినిమాకు కూడా వెళ్ళాం. అప్పటికి బాగానే ఉన్నాడు' శేఖర్ కంఠంలో కరుకుదనం వినిపించింది.

'వాట్ డూ యూ మీన్'

'యస్. అతను చనిపోలేదు. చంపబడ్డాడు. కేవలం మీ నిర్లక్ష్యం ధన వ్యామోహం అతణ్ణి పొట్టన పెట్టుకున్నాయి. అంత సీరియస్ కండిషన్ అయితే ముందే ఎందుకు చెప్పలేదు.' శేఖర్ ఉగ్రుడైపోయాడు.

'నా దగ్గర కేవలం నాలుగు రోజులు మాత్రమే ట్రీట్‌మెంట్ పొందాడు' నసిగాడు డాక్టర్.

'ప్రాణం పొయ్యటానికైనా, తియ్యటానికైనా రోజులు అక్కర్లేదు డాక్టర్! నిమిషాలు చాలు.'

'ఇంతకీ మీరేమంటారు? అతను చనిపోయి రెండురోజులయింది.'

'ఉన్నదే అంటున్నాను. అతని వద్ద ఉన్న డబ్బంతా అయిపోయేదాకా తగ్గుతుందని ఉంచారు. ఇక అతని నుంచి పైసారాదని తెలిసి, అతని కండిషన్ సీరియస్ అని గ్రహించి పట్నం తీసుకువెళ్ళమన్నారు' శేఖర్ ఆవేశం కట్టలు తెంచుకుంది.

'డోంటాక్ రబ్బిష్, ఇంత వరకూ మర్యాద ఇచ్చాను దానిని కాపాడుకోండి. అయినా మీకు అతనికి సంబంధం ఏమిటి? మీ డ్యూటీ మీరు సక్రమంగా చేసుకోండి. ఆఫ్టరాల్ పోస్ట్‌మేన్ కూడా చెప్పటమే' అన్నాడు చులకనగా.

'నా డ్యూటీలో ఏం లోపం జరిగినా దిద్దుకునే అవకాశం ఉంది డాక్టర్. మీ డ్యూటీలో లోపం జరిగితే ప్రాణాలే పోతాయి.'

'ఒక కేసు సక్సెస్ అయితే డాక్టర్ దేవుడనీ, ఫెయిలయితే డాక్టర్ హంతకుడనీ అనడం మొదట్నుంచి ఈ ప్రజ లకు అలవాటయింది.' అన్నాడు డాక్టర్.

'సినిమా డైలాగులు వద్దు డాక్టర్. మీరు ఆ కేస్, మీ వల్లకాదను కున్నప్పుడు, టేకప్ చేయకుండా మొదటే పంపించి ఉంటే సుబ్బారావు బ్రతికేవాడు. రాంగ్ ట్రీట్‌మెంట్‌వల్లే చనిపోయాడని అన్నారు పట్నంలో డాక్టర్లు.'

'అయితే గొడవకి వచ్చారా?' అసహనంగా అడిగాడు డాక్టర్.

'గొడవకి కాదు. నష్టపరిహారం రంగన్న కుటుంబానికి' అంతే అసహనంగా ఉన్నాడు శేఖర్.

'ఇదెక్కడి వింత. ఎక్కడా లేనిది ఇలా అయితే ప్రతీ డాక్టర్ ఫెయిల్ అయిన ప్రతీకేసుకూ నష్టపరిహారం చెల్లించాలా?' వ్యంగ్యంగా అన్నాడు డాక్టర్.

'నేను పోస్ట్‌మెన్‌ని అని మీరే చులకనగా మాట్లాడారు. మర్చిపోయారా? నేను ప్రతీరోజూ ఇంటింటికీ వెడుతుంటాను. సుబ్బారావు చావు వెనుక అసలు రహస్యం అందరికీ వివరించగలను' హెచ్చరిస్తూ చెప్పాడు శేఖర్.

'ఇంతకూ మీరు చెప్పేదేమిటి? ఏం కావాలి మీకు?' మెత్తబడ్డాడు డాక్టర్.

'నాకు కాదు. రంగన్న దంపతుల కాధారమైన కొడుకు లేకుండా పోయాడు. ఆ ముసలి దంపతులకు మీనుంచి కొంత సొమ్ము ఇవ్వాలి' అన్నాడు శేఖర్.

'ఎంత?' ప్రశ్నించాడు.

'పదివేలు' చెప్పాడు శేఖర్.

'అంత డబ్బే నావద్ద లేదు' నసిగాడు డాక్టర్.

'డాక్టర్ అన్న పదానికి గౌరవప్రదమైన అర్థం ఉంది. దాన్ని మీ విషయంలో మీరే మార్చుకున్నారు ఏమనో తెలుసా 'తెల్లకాకి' అని' నొక్కి పలికాడు శేఖర్.

'హోల్డ్ యువర్ టంగ్' డాక్టర్ కళ్ళు నిప్పులు కురిశాయి అవమాన భారంతో.

'అవును డాక్టర్. శాంతికి చిహ్నం తెలుపు. తెల్ల యూనిఫాం డాక్టర్లకు ఇచ్చింది ప్రభుత్వం మనస్సు, మనిషి శాంతంగా కల్మషం లేకుండా ఉండాలని. గాయాన్ని తన ముక్కుతో పొడిచి మరింత గాయపరచటం కాకి నైజం. తెల్లటిదుస్తుల్లో కాకి నైజం కలిగిన మీరు తెల్లకాకి కాక మరేమవుతారు సార్' అన్నాడు పోస్టుమెన్ ప్రతీకారంగా.

'నాకు కొంత టైం కావాలి. అలోచించుకోవాలి' అన్నాడు డాక్టర్ అప్పటికి వదిలించుకుందామని.

'చూడండి అమాయకపు ప్రజలు మిమ్మల్ని దేవుడని నమ్మి తలపోటన్నా, కాలు నొప్పన్నా మీ దగ్గర కొచ్చి వాళ్ళ సొమ్ము మొత్తం ధారపోస్తున్నారు. మీ నైజం తెలిస్తే ఒక్కొక్కరూ ఒక్కొక్క కాగడాగా మారి మిమ్మల్ని నామరూపాలు లేకుండా చేస్తారు' మరోసారి హెచ్చరించి బయటకు వచ్చాడు.

డాక్టర్‌కు ముచ్చెమటలు పోశాయి. మామూలు మనిషి కావటానికి కొంతటైము పట్టింది. కాంపౌండర్‌కి లోపల ఏం జరిగిందీ తెలియక పోయినా ఏదో సంఘర్షణ జరిగిందని ఊహించాడు.

★ ★ ★

రంగన్న, సత్తెమ్మ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. ఒకరికోసం ఒకరు బాధని దిగమింగుకుని కాలం గడుపుతున్నారు.

'ఏం రంగన్నా, ఎటో ఆలోచిస్తున్నావు' శేఖర్ వస్తూ అడిగాడు.

'రండి బాబూ, ఏం లేదు' అంటూ గోనె సంచి వేశాడు అరుగుమీద.

'ఇదిగో రంగన్నా' అంటూ ఒక కవరు అందించాడు శేఖర్.

'ఏంటిది బాబూ, ఈ కవరేంటి, ఈ డబ్బేంటి?' ఆశ్చర్యపోయాడు రంగన్న.

'నీకు చెప్పలేదు రంగన్నా మీ అబ్బాయి తెల్లకాకి అని ఒక కథ వ్రాశాడు. దానికి ఇప్పుడు వచ్చింది డబ్బు' అబద్ధం చెప్పాడు శేఖర్.

'ఆడే పోయినాక ఈ డబ్బు మాకెందుకు భాబూ' కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

'అవును శేఖర్ బాబూ, తెలియక అడుగుతాను. తెల్లకాకులుంటాయా బాబూ' సత్తెమ్మ లోపల్నుంచి వస్తూ ప్రశ్నించింది.

'లోకంలో చాలా ఉన్నాయమ్మా కానీ అందరికీ కనిపించవు. మీ అబ్బాయిలాంటి వాళ్ళకి కనబడింది' నేలవంక చూస్తూ అన్నాడు శేఖర్.

డాక్టర్ డబ్బు ఇచ్చిన సంగతి ఎవరికీ చెప్పదలచుకోలేదు. డాక్టర్ కోరిక కూడా అదే ఎవరికీ చెప్పవద్దన్నాడు.

'నేను వెళ్తాను రంగన్నా, సత్తెమ్మా' అంటూ బయల్దేరాడు శేఖర్.

రంగన్న, సత్తెమ్మ ఏదో గొణుక్కుంటున్నారు.

బహుశా కొడుకు గురించో, అతని కథ గురించో...

★

